## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-03-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు ఏకారణం వలన అయినా భయం వేస్తూ ఉంటే ఆ భయం ఉన్నంతకాలం టైము వేస్టయిపోతుంది. మనం ఎవరినైనా చూసి అసూయపడుతున్నాము అనుకోండి, అసూయ ఉన్నంతకాలం కాలం వృధా అయిపోతుంది. భగవంతుడిని స్మరించుకోవాలి అనుకొంటున్నాము కాని మనస్సు అటు వెళ్ళటంలేదు అని కొంతమంది అంటూ ఉంటారు. అది నిజమే ఎందుచేతనంటే మనకు కోపం ఎక్కువగా ఉంది అనుకోండి, ఎవరిమీద అయినా అసూయ ఉంది అనుకోండి, మనకు భయం వేస్తుంది అనుకోండి ఇంక మనస్సు వీటి చుట్టూ తిరుగుతుంది కాని భగవంతుడివైపుకు వెళ్ళదు. అలా మన మనస్సు వాటి చుట్టూ తిరుగుతున్నంతకాలం టైము అంతా వేస్టు అయిపోతుంది. బుద్ధుడి మొఖంలో ఎప్పుడూ కోపం కనబడదు. ఆయనకు విసుగు కలిగించే మాటలు, భక్తిలేని మాటలు మనం మాట్లాడితే ఆయన మౌనంగా ఉంటాడు అంతేగాని మనకు సమాధానం చెప్పడు. అవసరంలేదు అనుకొంటే ఒక్క మాట కూడా మాట్లాడడు. రమణమహర్షిగారు, రామకృష్ణపరమహంస గారు కొద్దిగా కోపం నటించేవారు. మన అవతారపురుషులలో నటనకోసం కూడా కోపం లేనివాడు బుద్ధుడు. రమణమహర్షిగారికి కోపం వచ్చింది అనుకోండి, అది నీటిమీద గీత వంటిది. వారికి కోపం రావటానికి అది వారికి ఒక వికారం కాదు, మనకోసం నటిస్తారు అంతే. బుద్ధుడు అయితే మన కోసం కూడా కోపం తెచ్చుకోడు. బుద్ధుడు ప్రతీ విషయాన్ని హేతుబద్ధంగా మాట్లాడతాడు. వాడు నా స్నేహితుడు, వీడు నా విరోధి అని అనుకొంటాము. వీటివలన టైము వేస్టు. వాడు నా స్నేహితుడు అని ఎవరు చెపుతున్నారు, నీ మనస్సే చెపుతోంది. వీడు నా విరోధి అని ఎవరు చెపుతున్నారు, అదీ నీ మనస్సే చెపుతోంది. ఈ గొడవలు అన్నీ నీ మనస్సు కల్పితములేగాని అందులో ఏమీ లేదు. ఇలా మనస్సు కల్పించిన గొడవల చుట్టూ తిరుగుతూ ఒకరోజు, రెండు రోజులు కాదు వేలాదిజన్మలు పాడుచేసుకొంటున్నాము, ఇది మనకు తెలియటం లేదు.

మిమ్మల్ని నేను ప్రేమిస్తున్నాను, మీ కోసమే బతుకుతున్నాను అంటాడు. అది నిజంకాదు, మాయ. అంతా ఈ చిన్న వాక్యంలో ఉంది. ఇద్దరు ఉంటే ఒకరిని ఒకరు ప్రేమించుకోవటం, ఉన్నది ఒక్కటే అయినప్పుడు ఈ గొడవలు ఏమీ లేవు. వారికి నేను చాలా ఉపకారం

చేసాను, వారికి ఏమీ కృతజ్ఞత లేదు అంటాడు. ఇవి ఏమీ నిజం కాదు. మీకు నిజంగా ఎవరి మీద అయినా ప్రేమ ఉంటే నాకు ప్రేమ ఉందని నోటితో చెప్పరు, యాక్షన్‌లో చూపిస్తారు అంతే. చేత్తోటి చేసేటప్పుడు నోటితో చెప్పటం ఎందుకు. మన మనస్సుకు బాగా సన్నిహితంగా ఉన్న వారికి ఎక్కువ గౌరవం చెయ్యము. సన్నిహితం కాని వారికే ఎక్కువ గౌరవం చేస్తాము, అలా చేయటానికి కారణం ఏమిటి అంటే వారు ఏమీ అనుకోకుండా ఉండాలి అనుకొంటాము, దీని వలన మనస్సు పెరిగిపోతుంది, మనం ఊరికే గుడ్డితనంగా ఉంటే సబ్జక్టు తెలియదు, మనస్సులో విశ్లేషణ ఉండాలి. మనకు గుణాలు ఉన్నాయి, గుణాలను బట్టి పనిచేస్తాము. ఆ గుణాలు చేస్తున్నాయన్న సంగతి తెలియక నేను చేసాను అంటాడు. సత్వగుణం ఉన్నవాడు ఒక రకంగా పనిచేస్తాడు, రజోగుణం ఉన్నవాడు ఇంకో రకంగా పనిచేస్తాడు, తమోగుణం ఉన్నవాడు వేరొకరకంగా పనిచేస్తాడు. ఈ గుణాలను తీసేస్తే లోపల చేసేవాడు కనబడడు, వాడు బ్రహ్మమైపోతాడు. ఈ గుణాలు ఉన్నవాడు జీవుడు, ఈ మూడు గుణాలను దాటినవాడు దేవుడితో సమానము, వాడికి నమస్కరిస్తే అది భగవంతుడికే అందుతుంది. వాడి ద్వారా భగవంతుడు మనలను ఆశీర్వదిస్తాడు.

కాలువలో ఉన్న నీరు వచ్చి మన చేనులో పడిపోదు, ఆ నీరు ఏదో బోది ద్వారా, తూము ద్వారా వచ్చి మన చేనులో పడుతుంది. అలాగే ఈశ్వరుని యొక్క కృప గురువు ద్వారా మనకు అందుతుంది. మనకు ఒక కోరిక నెరవేరింది అంటే అది వంద కోరికలను తీసుకొని వస్తుంది. వంద కోరికలు వచ్చినా పరవాలేదు, వెంటనే గర్వం వచ్చేస్తుంది. ఈ కోరికల వలన వచ్చే ఫలితం భౌతికమైనదికాని గర్వం మరణానంతరం మన కూడా వచ్చేస్తుంది, అది అనేక నీచ జన్మలకు కారణం అవుతుంది. ఇప్పడు మనం ప్రపంచంతోటి ఎక్కువగా కలిసి ఉంటున్నాము. మనం ప్రపంచంతోటి ఇష్టంగా ఉండే కొలది భవంతుడికి దూరమైపోతాము. మనం ప్రపంచానికి చెందిన మనుషులమే అయితే దానిని నెత్తిన వేసుకొని తిరిగినా ఫరవాలేదు కాని మనం ప్రపంచానికి చెందిన మనుషులం కాదు, మనం భగవంతుడికి సంబంధించిన మనుషులము. అందుచేత మనం ప్రపంచంతోటి, సమాజంతోటి అతిగా ఉండకూడదు. మనం రోజూ కంచంలో అన్నం తింటాము, అన్నం తిన్న తరువాత దానిని కడిగేసి ఒక ప్రక్కన పెట్టేస్తాము కాని దానిని నెత్తిమీద పెట్టుకొని తిరగము. మనం కంచాన్ని ఎలాగ ఉపయోగించుకొంటున్నామో అలాగే ప్రపంచాన్ని ఉపయోగించుకోవాలి, మనకు ఎంత వరకు అవసరమో అంతవరకు దానితో ఉండాలి, అతి పనికి రాదు.

భగవంతుడు హృదయంలో ఉన్నాడు. మనకు నేను అనే తలంపు ఉంది. అది హృదయంలో నుండే వస్తోంది. ఈ నేను అనే తలంపు పోతే మనం భగవంతుడిలోనే ఐక్యమైపోతాము ఎందుచేతనంటే అది అక్కడ నుండే వస్తోంది. మన ద్వారా మంచి జరిగినా, చెడ్డ జరిగినా నడిపించేవాడు భగవంతుడే అంటే చెడ్డపనులు భగవంతుడు చేస్తున్నాడు అని కాదు, నీలో చెడ్డగుణాలు ఉంటే వాటి ద్వారా పని చేయించేవాడు ఆయనే. వాడు మంచి చేసాడు, వీడు చెడ్డ చేసాడు అని అనుకొన్నా వెనకాల ఉన్నవాడు ఎవరు? దేవుడే ఉన్నాడు. అయితే నీ గుణాలను బట్టి నీచేత పని చేయిస్తున్నాడు అంతే. నాలో మంచితనం అసలు లేదు అనుకోండి, అది కవర్ చేసుకోవటానికి అందరినీ విమర్శిస్తూ ఉంటాను. వాడి గురించి చెప్పకోవటానికి ఏమీ లేదు అందుచేత. వాడు చెడ్డవాడు, వీడు చెడ్డవాడు అని అలా చెప్పగా చెప్పగా వీడిని మంచివాడు అనుకొంటారని అలా చేస్తాడు, అసలు ఉద్దేశం అది. వాడు కూడా చెప్పాలని చెప్పడు వాడిలో ఉన్న చెడ్డ ఇది అంతా చేయిస్తుంది. చెడ్డవారితో భగవంతుడు మిమ్మల్ని తిట్టిస్తాడు, భగవంతుడు ఎందుకు అలా చేస్తున్నాడు అంటే మీలో సహనం ఎంతవరకు ఉందో తెలుసుకోవటానికే అలా చేస్తున్నాడు. మంచివారితో తిట్టించాలన్నా వారు తిట్టరు అందుచేత చెడ్డవారిని ఉపయోగించుకొంటాడు. మీ మనస్సుకు ట్రైనింగ్ ఇవ్వటం కోసం, మీ మనస్సును బాగుచేయటంకోసం చెడ్డవారిని ఉపయోగించు కొంటాడు. చెడ్డవారికి ఏమీ పనిలేదు అనుకోవద్దు. ప్రపంచంలో చెడ్డవారు కూడా అవసరం. మంచివారిని ఇంకా మంచివారుగా చేయటానికి, మనిషిని మహాత్ముడిగా చేయటానికి చెడ్డవారి పాత్ర అవసరం ఉంది కాబట్టే అక్కడ చెడ్డవారు ఉన్నారు. కైకేయి లేకపోతే రామాయణం లేదు. కైక లేకపోతే రాముడు అరణ్యానికి రాడు. రాముడు అరణ్యానికి రాకపోతే రాక్షసులను ఎవడు సంహరిస్తాడు.

మీరు నిరంతరం లోకాన్ని చింతిచటం వలన మరల దేహం వచ్చేస్తుంది ఎందుచేతనంటే లోకంలో ఉన్న భోగాలు అనుభవించటానికి దేహం అవసరం, ఇంక వాడు ఈ చక్రంలో నుండి బయటకు రాలేడు. ఇలా లోకాన్ని చింతించేబదులు నిరంతరం బ్రహ్మాన్ని చింతిస్తాడు అనుకోండి బ్రహ్మం అయిపోతాడు. అప్పడు ఇంక నీకు లోకంతోటి, దేహంతోటి పనిలేదు. భగవంతుడు మనకు దేహాన్ని ఇవ్వాలని ఇవ్వడు. మనకు కోరికలు ఉన్నాయి అనుకోండి, ఆ కోరికలు నెరవేరాలంటే దేహం అవసరం కాబట్టి మనకు దేహాన్ని ఇస్తాడు. మనకు ఏ కోరిక లేదు అనుకోండి ఇంక దేహంతో మనకు పని లేదు. మీరు సుఖాన్ని

కోరుకోవటంలో తప్పులేదు కాని అది ఎక్కడ లేదో అక్కడ సుఖం కోసం వెతుక్కొంటున్నాము. సుఖం అనేది ఎక్కడ ఉందో నీకు తెలియజేసి అక్కడకు మీ మనస్సును తిప్పేవాడే గురువుకాని మీ మెప్పులకోసం మీకు ఇష్టమైన మాటలు చెప్పేవాడు గురువుకాదు, వాడు రాక్షసుడు. మీ అహంకారాన్ని పెంచే మాటలు చెపుతూ ఉంటే అది ప్రేయస్సు. మీకు మేలు కలుగజేసే మాటలు, మీ మనస్సును పవిత్రం చేసే మాటలు చెపుతూ ఉంటే అది శ్రేయస్సు. గురువు అనేవాడు మీకు శ్రేయస్సు మాటలే చెప్పాలి. విషయచింతన విషంకంటే ప్రమాదం అని ఆచార్యులవారు చెప్పారు. ఎందుచేతనంటే విషాన్ని మీరు చింతన చేయటం వలన చావరు, అది తాగితే చనిపోతారు. విషయచింతన అలా కాదు. విషయాలను చింతిస్తూ ఉంటే అది అనేక నీచజన్మలకు కారణం అవుతుంది.

నీ మనస్సులో ఉన్న అన్ని కోరికలను, సంకల్పాలను విడిచిపెట్టు. ఏ రకమైన కోరిక ఉన్నా బంధమే. కోరిక లేకపోతే పని అవ్వదేమో అని మనం అనుకొంటాము. మీ ప్రారబ్దంలో ఉంది అనుకోండి, మీ కోరికతో సంబంధం లేకుండా ఆ పని అయిపోతుంది. అది ఈశ్వరుడి ప్రణాళికలో లేదు అనుకోండి మనం ఎంత ప్రయత్నం చేసినా ఆ పని అవ్వదు. రమణమహర్షి గారు బ్రహ్మం గురించి శ్రవణం చేయలేదు, దాని గురించి ఆయన ఏమీ చదవలేదు, అంటే దాని గురించి ఏమీ తెలియకుండానే బ్రహ్మానుభవం పొందారు, అంటే ఆయనకు ఆయోగం ఉంది. నీకు అర్హత ఉంటే, ఆ యోగ్యత ఉంటే దానంతట అదే వచ్చేస్తుంది. మనకు ఎంతవరకు అర్హత ఉందో, ఎంత వరకు యోగ్యత ఉందో అంతే వస్తుంది కాని అంతకంటే ఎక్కువ రాదు. నేను యుద్ధం చేయను అని అర్జునుడు చెపుతాడు. పరమాత్మ ఏమని చెప్పాడు అంటే అది నీ కోరిక మీద ఆధారపడి లేదు. నీ ప్రారబ్దంలో యుద్ధం చేయటం ఉంది, ఒకవేళ యుద్ధం చేయటం నీకు ఇష్టం లేకపోయినా నీ స్వభావం బలవంతాన నీచేత యుద్ధం చేయిస్తుంది అని చెప్పాడు. ఒకేసారి అన్ని కోరికలను విడిచిపెట్టలేవు అందుచేత నెమ్మదిగా వాటిని తగ్గించుకొంటూరా, కోరికలు మినిమమ్ చేసుకో. మనకు దేహాత్మబుద్ధి ఉంది కాబట్టి జిన్నూరుకు మనకు సంబంధం ఉంది. దేహం మీరు అయితే జిన్నూరుకు మీకు సంబంధం ఉంది కాని దేహం మీరు కానప్పడు ఇంక సంబంధం ఏమిటి? పుట్టినవాడు చనిపోతాడు కాని పుట్టనివాడు ఎలా చనిపోతాడు. నువ్వు పుట్టనివాడివే. ఆ పుట్టనివాడు ఎవడో తెలుసుకొనేవరకు ఎన్ని జన్మలు ఎత్తినా నువ్వు ఈ బంధంలో నుండి బయటకు రాలేవు. ఇవన్నీ భగవంతుడు మనకు చెపుతూ ఉంటే, అంతా అబద్ధం అని మనకు అనిపిస్తుంది

ఎందుచేతనంటే దానికి సంబంధించిన అనుభవం మనకు లేదు. భగవంతుడు చెపుతున్నాడు, ఈ విషయాలు మనకు అర్ధమవ్వటం లేదు అని మనం అనుకోము, ఇవన్నీ అబద్ధాలు అనుకొంటాము. భగవంతుడు చెప్పిన విషయాలు అబద్ధం అనుకొంటే ఆయనకు నష్టం ఏమిటి? మనమే నష్టపోతాము. మన తలకాయలో ఉన్నదే నిజం అనుకొంటాము కాని ఆయన చెప్పింది నిజం అనుకోము. మన తలకాయలో ఉన్న గొడవ అంతా మూటకట్టి ఒక ప్రక్కనపెడితే అప్పుడు ఆయన చెప్పింది మనకు అర్ధమవుతుంది. కృష్ణుడు దుర్మార్గుడు అనుకొంటే ఇంక ఆయన చెప్పేది మనకు ఎలా అర్ధమవుతుంది, ఎంతోకొంత భగవంతుడు మీద గౌరవం ఉండాలి కదా.

గురువు యొక్క దయలేకుండా మీకు ఎంత చదివినా అది మీకు అర్ధమవ్వదు, ఒక్క శబ్దం కూడా మీ గుండెను తాకదు. ఆయన అనుగ్రహం లేకుండా ఉన్నది ఉన్నట్లుగా గ్రహించే శక్తి మనకు రాదు. వివేకానందుడు బుద్ధుడు గురించి చాలా గొప్పగా చెప్పేవాడు. మన మహారాజులు, దేవుళ్ళకంటే ఆయన గొప్పవాడు అని వివేకానందుడి ఉద్దేశ్యం. బుద్ధుడికి ఇల్లు విడిచిపెట్టి వచ్చాక ఆయనకు ఎప్పుడూ ఇంటి గురించి చింత రాలేదు, రాజ్యం గురించి చింత రాలేదు. మనం ఇంటి దగ్గర పిడకలు ఎండబెట్టి పాలకొల్లు గుడికి వెళ్ళాము అనుకోండి, వర్షం వచ్చింది అనుకోండి, అప్పుడు మనం పాలకొల్లు గుడిలోనే ఉంటాము కాని ఇంటి దగ్గర పిడకలు తడిసిపోతాయేమో అనుకొంటాము అంటే మనం ప్రపంచానికి అంత దగ్గరగా ఉన్నాము. కొంపలు మిమ్మల్ని పట్టుకోలేదు, మీరే కొంపలను పట్టుకొని ఏడుస్తున్నారు అంటాడు స్వామీజీ. ఎవరిని అడిగినా మేము గృహస్థులం, మేము గృహస్థులం అంటున్నారు. గృహాలను మీరు పట్టుకొన్నారా, గృహాలు వచ్చి మిమ్మల్ని పట్టుకొన్నాయా అని అడిగాడు. ఇల్లు విడిచిపెట్టి ఇక్కడకు మీరు వచ్చారు కదా. ఇక్కడకు వెళ్ళవద్దని మీ ఇల్లు చెప్పిందా ఏమీ చెప్పలేదు. కాని ఆ ఇంటిమీద మీకు ఉన్న మోహం కొలదీ ఇక్కడకు వచ్చాక కూడా ఆ ఇంటినే తలపెట్టుకొంటున్నారు. మీరు ఇంటిని పట్టుకొని అది నన్నుపట్టుకొంది అనుకొంటున్నారు. అది మిమ్మల్ని పట్టుకోలేదు, మీరే ఇంటిని పట్టుకొన్నారు.

సముద్రంలో ఎంత నీరు ఉందో అంత ఆనందం మన హృదయంలో ఉంది. మీరు ఆ హృదయంలో కరిగిపోయినప్పుడు ఇంక ఆనందంకోసం బయట తిరిగే జీవుడు కనబడడు. ఒకసారి స్వరూపసుఖం మీకు అందిందా ఇంక దానితోటి ఎడబాటు రాదు. ఎప్పడైనా చెడు ప్రారబ్దం ఉండి స్వరూపసుఖాన్ని నీవు మరిచిపోయినా మరల సడన్‌గా హృదయంలో

ఉన్న ఆత్మారాముడు గుర్తుకు వచ్చి అక్కడకు జారిపోతావు, అందులో లయమైపోతావు. హృదయంలో ఉన్న సుఖం ఎలా ఉంటుంది అంటే మీకు అర్థమవ్వటంకోసం చెపుతున్నాను. మీకు వెయ్యికోరికలు ఉన్నాయి అనుకోండి. వెయ్యికోరికలు ఒకేసారి నెరవేరిపోయినాయి అనుకోండి, అప్పుడు మీకు ఎంత ఆనందం వస్తుందో దానికి వెయ్యిరెట్లు ఉంటుంది లోపల ఉన్న ఆనందం, అది ఇట్టిది అని ఎవరూ చెప్పలేము, ఇంక దానిలోనుండి మీరు ఎలా బయటకు వస్తారు. నువ్వు ఊహించుకోవటం మానెయ్యి. ఊహించుకోవటం వలననే నీకు భయం వస్తుంది, ఇష్టం వస్తుంది, అయిష్టం వస్తుంది, అన్ని వికారాలు వస్తాయి. నువ్వు రవ్వంత, ముల్లంత నీ మనస్సును హృదయం వైపుకు తిప్పితే అదే లాగేస్తుంది. ఎవరు లాగుతున్నారు అంటే అది ఆయన దయే. హృదయంలో ఉన్నవాడు దయాస్వరూపుడు, ఆయన మహాగురువు. ఆయన మీ కళ్లకు కనిపించకపోయిన, మీ బుద్ధికి అందకపోయినా అక్కడ ఉన్నవాడే పురుషోత్తముడు, ఆయనే ఆనంద స్వరూపుడు. నువ్వు సుఖాన్ని కోరుకోవటంలో తప్పలేదు, కాని సుఖాన్ని బయట నుండి పొందుదామనుకొంటున్నావు, అది తప్ప. బయట ఉన్న సుఖం ఎట్టిది అంటే దుఃఖం అనే కిరీటం పెట్టుకొన్న సుఖం. బయట నుండి వచ్చేది సుఖం అని నీవు అనుకోవచ్చుకాని చివరకు అది అంతా దుఃఖంగా మారిపోతుంది. నీ లోపల ఉన్న సుఖమే నిజమైన సుఖం, ఆ సుఖస్థానంలో నిలబడ్డావు అనుకో నీలోపల దుఃఖం ఉన్నా అది అంతా ఆనందంగా మారిపోతుంది.

ఈ ఒక్కమాటను జాగ్రత్తగా అర్థం చేసుకోండి. ఆత్మ చెప్పింది అహంకారానికి అర్థమవుతుందా? కృష్ణుడు అంటే ఎవడు ఆత్మ. మనకు ఉన్నది ఏమిటి అహంకారం. ఆయన చెప్పింది మనకు ఎలా అర్థమవుతుంది. అర్థమవ్వటం లేదు అని ఊరుకోకూడదు, తెలుసుకోవటానికి ప్రయత్నం చేయాలి. అలా మనం ప్రయత్నం చేయగా, చేయగా మీరు ఎంత మొద్దబ్బాయిలు అయినా మీరు ప్రయత్నం చేస్తూ ఉంటే ఆత్మానుగ్రహం వస్తుంది. ఆత్మానుగ్రహం వలన ఆత్మ చెప్పింది మనకు తెలుస్తుంది, అదీ లాజిక్కు. సహజంగా ఉన్న ఆనందం. మీ చేతికి అందినప్పడు ఇంక కృత్రిమంగా వచ్చే ఆనందాల కోసం నువ్వు బయట తిరగవు. పంచదార డబ్బాలో ఉన్న చీమను నువ్వు బయటకు వచ్చేయి అని అడిగినా అది రాదు అలాగే జీవుడికి సహజమైన సుఖం, ఆనందం అందినప్పడు ఇంక బయట సుఖాల మీదకు మనస్సు వెళ్లదు. సహజమైన సుఖం దొరికేవరకు సహజంకాని సుఖాల మీదకు నీ మనస్సు వెళ్లిపోతూ ఉంటుంది, నువ్వు ఆపు చెయ్యాలన్నా అది ఆగదు. హృదయంలో ఉన్న

సహజమైన సుఖం దానికి దొరికితే నేచురల్‌గా నీ మనస్సుకు నిగ్రహం వచ్చేస్తుంది, అది అణిగిపోతుంది. ఎంత చీకటిగా ఉన్నా ఏదో టైముకు వెలుతురు వస్తుంది అలాగే మీకు ఎన్ని కష్టాలు ఉన్నప్పటికీ మీరు సాధన విడిచిపెట్టకుండా ఉంటే, భగవంతుని పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే ఏదో రోజున మహావెలుతురును మీరు చూస్తారు అయితే మధ్యలో విడిచిపెట్టకూడదు. ఒకమంచిపని చేసేటప్పుడు అవసరమైతే చావు వచ్చినా దానికి స్వాగతం చెప్పండి అంటే చావు కావాలని తెచ్చిపెట్టుకోమని కాదు. ఎటువంటి కష్టాలు ఎదురైనా భయపడవద్దు, సాధన విడిచిపెట్టవద్దు. పరమాత్మ ఏమని చెప్పాడు అంటే ఈ సృష్టి అంతా వాసుదేవ స్వరూపమే, దానికి భిన్నంగా ఏమీ లేదు. అది మీరు నోటితో చెప్పటంకాదు, అది మీకు అనుభవంలోనికి వస్తే అదే మీకడసారి జన్మ అని చెప్పాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ౦౯-౦4-౨౦౦౯, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇది కలియుగం. ఈ కలియగంలో మీరు పెద్దపెద్ద యజ్ఞాలు, యాగాలు చేయనక్కరలేదు. రామనామం, కృష్ణనామం, శివనామం ఇలా ఏదో భగవంతుడు యొక్క నామం హృదయపూర్వకంగా చేసుకొంటే మీరు తరిస్తారు. పూర్వపు యుగాలలో యజ్ఞాలు, యాగాలు చేసిన వారికి ఎటువంటి ఫలితం వస్తుందో కలియుగంలో నామస్మరణ వలన అటువంటి ఫలితం వస్తుంది. ఇప్పుడు మనవారు కాలేజీలు, హాస్పటల్స్ కట్టించటానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నారు, గుడులు కట్టాలి అంటే గుడులు ఎందుకు అంటున్నారు. ఇక్కడే మనం పాడైపోతున్నాము, ఆ విషయం మనకు తెలియటం లేదు. ఏదైనా రోగం వస్తే హాస్పటల్‌కు వెళితే ఆ రోగం తగ్గుతుంది, కాలేజీలో చదువులు చెపుతారు, ఈ కాలేజీలవలన, హాస్పటల్స్‌వలన మనిషిలో ఉన్న చెడుఅలవాట్లుపోవు, అవి అలాగే ఉంటాయి. కొంతమంది చాలా బాగా చదువుతారు, వారు అందరూ బుద్ధిమంతులు అని చెప్పలేము. నూటికి నూరు మార్కులు వచ్చేటప్పటికి ఇతరులకంటే మనలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటారు, గర్వం వచ్చేస్తుంది, అసలు మనిషి పాడైపోవటానికి అదే కారణం. అందరూ అలా ఉంటారు అని చెప్పలేము. మన శరీరం యొక్క రంగులు తేడా, మన మనస్సులు తేడా కాని మనం అందరం ఒక్కటే. మీరు వేరు, నేను వేరు అనే తలంపు మనకు ఉంది, ఆ వేరుబుద్ధి వలన మనం పాడైపోతున్నాము. మీరు వేరు, నేను వేరు అనే తలంపు మనకు నిద్రలో లేదు.